సాక్షి విజయనగరం

గురువారం । 3 । ఆగస్టు । 2023



అవినీతి పరులకు గుండెదడ..!

అవినీతిని అంతమొందించడమే ఏసీబీ లక్ష్యం. అందరికీ అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ 14400, యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

- 8లో



అర్హత ఉన్న పేదలందరికీ పట్టాలు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం పట్టాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

- 8లో



ఏనుగుల దాడిలో పాడి ఆవు మృతి

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టిస్తోంది.

- 8లో

న్యూస్‌రీల్

6న దేవులపల్లి అమర్ రాక

విజయనగరం అర్బన్: జాతీయ మీడియా సలహాదారుడు దేవులపల్లి అమర్ ఈ నెల 6వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి రోడ్డు మార్గం గుండా 11 గంటలకు ప్రభుత్వ అతిథిగృహానికి చేరుకుంటారు. ఉదయం 11.20కి పట్టణంలోని మహాకవి గరజాడ స్వగృహాన్ని సందర్శిస్తారు. 11.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరం చేరుకొని, అధికారులు, అనధికారులను కలుస్తారు. అక్కడ జరిగే ఏపీయూడబ్ల్యూజే మహాసభలో పాల్గొంటారు. అనంతరం 3.30 గంటలకు బయలుదేరి విశాఖ వెళ్తారు.

11న రామతీర్థం హుండీల ఆదాయం లెక్కింపు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 11న స్వామివారి హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దేవస్థానం ఈఓ కిషోర్‌కుమార్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. దేవస్థాన ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దేవస్థానం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పలు ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవా భక్తులు హుండీల ఆదాయాన్ని లెక్కిస్తారని చెప్పారు.

లోగో రూపొందించండి.. బహుమతి గెలుచుకోండి

- ఆడుదాం ఆంధ్రా లోగో రూపకల్పనకు అవకాశం
- సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్



విజయనగరం: యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించిన లోగో, మస్కట్ రూపకల్పనకు ఆసక్తి గల వారికి అవకాశం కల్పిస్తున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ బుధవారం తెలిపారు. ఉత్తమ లోగో రూపొందించిన వారికి బహుమతి అందజేస్తుందన్నారు. మొత్తం ఐదు స్థాయిల్లో ఐదు క్రీడాంశాల్లో 46 రోజుల పాటు క్రీడా పోటీలు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరగనుండగా.. మంచి ఆలోచనలతో లోగో, మస్కట్‌లను తయారు చేసిన మొదటి ముగ్గురికి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు అందజేయనున్నట్టు శాప్ ప్రకటించిందన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్టు జిల్లా ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంగర మండలం శివ్వాం గ్రామంలో శ్రీనివాస ఆయిల్ మిల్, శ్రీ గోపాల కృష్ణ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోను, బొబ్బిలి మండలం ఎం.వెలగవలస గ్రామంలో లక్ష్మి బాలాజీ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్, గుర్ల మండలం సదానందపురం గ్రామంలో రాధిక వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేటు లిమిటెడ్, ఎస్.కోట మండలం కాపు సోంపురం గ్రామంలో ఎఫ్.ఆయిల్ పామ్ ప్రైవేటు లిమిటెడ్, పూసపాటిరేగ మండలం కొల్లాయి వలస గ్రామంలో పంతంజలి ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్లాంటేషన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం



తీరానికి కొట్టుకు వచ్చిన అప్పన్న మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని పతివాడబర్రిపేటలో మంగళవారం జరిగిన బోటుబోల్తా పడిన ప్రమాదంలో గల్లంతైన వాసుపల్లి అప్పన్న మృతదేహం 24 గంటల తరువాత లభ్యమైంది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం అల్లివలస సముద్రతీరంలో అప్పన్న విగతజీవిగా ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. ప్రాణాలతో తిరిగివస్తాడని అప్పన్న భార్య లక్ష్మితో పాటు మత్స్యకారులు వేయికళ్లతో ఎదురుచూసినా నిరాశే ఎదురైంది. అప్పన్నకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రణస్థలం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీ..

రూ. 33.69 కోట్లు



విజయనగరం ఫోర్ట్:

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. వివిధ సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలుచేస్తోంది. ఆర్థికోన్నతికి తోడ్పాటు నందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు అధిక ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తోంది. ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్ల వినియోగం వరకు ప్రభుత్వమే భరిస్తోంది. పేదల గృహాల్లో విద్యుత్ వెలుగులు నింపుతోంది. నాలుగేళ్ల కాలంలో కోట్లాది రూపాయల విలువైన విద్యుత్‌ను రాయితీకింద సరఫరా చేసింది.

90 శాతం మందికి ప్రయోజనం

జిల్లాలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలే. వారంతా ఉచిత విద్యుత్ పథక ప్రయోజనాలు పొందుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 200 యూనిట్లను సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో కొంతమందికి విద్యుత్ సౌకర్యం ఉండేదికాదు. విద్యుత్ బిల్లులు కూడా కట్టుకునే పరిస్థితి లేకపోవడంతో విద్యుత్ మీటర్ పెట్టుకునేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పనతో ప్రతి ఒక్కరి ఇళ్లలోనూ విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయి. గతంలో 100 యూనిట్ల విద్యుత్ వినియోగం వరకు రాయితీ ఉండేది. దానిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 200 యూనిట్లకు పెంచింది. నెలకు ఒక్కో ఇంటికి రూ.1200 విలువైన విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తోంది.

- నిరాటంకంగా ఉచిత విద్యుత్ సరఫరా
- నాలుగేళ్లలో ఎస్సీలకు రూ.24.40 కోట్లు, ఎస్టీలకు రూ.9.29కోట్ల లబ్ధి
- ఎస్సీలు వినియోగించిన యూనిట్స్: 17.60 కోట్లు
- ఎస్సీలు వినియోగించిన యూనిట్స్: 8.95 కోట్లు
- నెలకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.1200 వరకు ఆదా
- 200 యూనిట్ల వినియోగం వరకు ఉచితం

2019 నుంచి 2023 జూన్ నెలవరకు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇచ్చిన రాయితీ

	ఎస్సీ లబ్ధిదారుల వివరాలు			ఎస్టీ లబ్ధిదారుల వివరాలు		
సంవత్సరం	లబ్ధిదారులు	యూనిట్లు	రాయితీ రూ.కోట్లలో	లబ్ధిదారులు	యూనిట్లు	రాయితీ రూ. కోట్లలో
2019-20	51,467	5,21,21,444	రూ.6.61 కోట్లు	40,842	2,90,86,203	రూ. 3.14 కోట్లు
2020-21	52, 463	4,10,02,517	రూ. 9.81 కోట్లు	41,087	2,13,55, 305	రూ. 2.90 కోట్లు
2021-22	54,367	3,85,59,894	రూ.1.09 కోట్లు	36, 573	1,87,71,747	రూ 0.47 కోట్లు
2022-23	49,688	3,40,90,389	రూ.6.16 కోట్లు	35,535	1,58,02,130	రూ.2.52 కోటు
2023-23 (జూన్)	49,977	1,02,43,408	రూ0.71 కోట్లు	37033	45,24,890	రూ.0.25 కోట్లు

ఎస్సీలకు 24.40 కోట్ల లబ్ధి..

నాలుగేళ్ల కాలంలో ఎస్సీలు 17,60,17,652 యూనిట్లు వినియోగించారు. దీనికి గాను ప్రభుత్వం వారికి ఇచ్చిన రాయితీ రూ. 24.40 కోట్లు. ఏటా 50 వేల నుంచి 52 వేల మంది వరకు ఎస్సీలు లబ్ధిపొందుతున్నారు. ఎస్టీలు 37 వేల నుంచి 40 వేల మంది వరకు లబ్ధి పొందుతున్నారు. ఈ నాలుగు ఏళ్ల కాలంలో 8,95,40,275 యూనిట్లు ఎస్టీలు వినియోగించారు. వారికి ప్రభుత్వం రూ. 9.29 కోట్ల రాయితీ ఇచ్చింది.

ప్రభుత్వమే విద్యుత్ బిల్లులు చెల్లిస్తోంది



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాక ముందు మాకు విద్యుత్ బిల్లు నెలకు రూ.250 నుంచి రూ.300 వరకు వచ్చేది. నాలుగేళ్లగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించేవారికి ప్రభుత్వమే బిల్లు చెల్లిస్తోంది. దీంతో విద్యుత్ బిల్లుల బెంగతీరింది. మా లాంటి పేదవారి కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– దుక్కరమణ, లబ్ధిదారుడు, పెదవేమలి గ్రామం

బడుగు, బలహీన వర్గాలకు అండగా..



మాలాంటి బడుగు, బలహీన వర్గాల వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. గతంలో 100 యూనిట్ల వరకు రాయితీ ఉంటే దానిని 200 యూనిట్లకు సీఎం జగన్ మోహన్ రెడ్డి పెంచడం అభినందించదగ్గ విషయం. పేదల అంటే సీఎంకు ఎంతో అభిమానం. వారి సంక్షేమం కోసం నాలుగేళ్లగా పరితపిస్తున్నారు. ఆయన పేదల సీఎం.

– చోల రఘుబాబు, లబ్ధిదారుడు, చంద్రంపేట గ్రామం

200 యూనిట్ల వరకు ఉచితం



ఎస్సీ , ఎస్టీల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని ప్రభుత్వం ఉచితంగా ప్రకటించింది. బిల్లులను ప్రభుత్వమే భరిస్తోంది. నాలుగేళ్లగా పేదల ఇళ్లకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం.

– మువ్వల లక్ష్మణరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ

ఆరోగ్యకర ఆహారం



కలెక్టర్ కార్యాలయంలో సంపూర్ణ పౌష్టికాహార కిట్లును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్, జేసీ తదితరులు

- తల్లిబిడ్డల ఆరోగ్యంపై జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సొంత అన్నలా ఆరోగ్యసంరక్షణ చర్యలు
- లబ్ధిదారుల ఇంటికే పౌష్టికాహారం పంపిణీ
- అట్టహాసంగా ప్రారంభమైన సరుకుల పంపిణీ

విజయనగరం ఫోర్ట్: తల్లీబిడ్డల ఆరోగ్యంపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలతో పాటు ఆరోగ్యకర ఆహారాన్ని అందజేస్తోంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వడ్డించే భోజనం సరుకులను ఇప్పుడు నేరుగా ఇంటికే చేర్చుతోంది. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు భాగస్వాములయ్యారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యజాగ్రత్తలు వివరించారు. వైఎస్సార్ సంపూర్ణపోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాల కింద ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్‌హోమ్ రేషన్ కార్యక్రమాన్ని విజయనగరం కలెక్టరేట్‌లో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డలు, గర్భిణుల ఆరోగ్యంపై ఓ అన్నలా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద ఒక్కొక్కరికి సుమారు రూ.1010 విలువైన కిట్లను అందజేస్తున్నారన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, భవిష్యత్ తరాలు శక్తివంతంగా మారాలన్న గొప్ప లక్ష్యంతో వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలుచేస్తున్నట్టు వివరించారు. అనంతరం గర్భిణులకు మహిళా అధికారులు, నాయకులు సామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గద్దం ఉమ, జేసీ మయూర్‌అశోక్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జెడ్పీ మహిళా సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ శాంత కుమారి, నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఎం.లయాయాదవ్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, జేసీ మయూర్‌అశోక్, డీర్వో గణపతిరావు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి బి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి ఐసీడీఎస్‌లో వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



జామి మండలం కుమరాంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



నెల్లమర్లరూరల్: నెల్లిమర్ల మండలం గుషిణిలో గర్భిణికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కొత్తవలస: సీడీపీఓ కార్యాలయంలో గర్భిణులకు పౌష్టకాహారం కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నెక్కల నాయుడుబాబు

పారదర్శకంగా ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఎం.గణపతిరావు

- నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తాం
- సమీక్ష సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇంటింటి సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలను సమన్వయం చేసి నిర్ణీత షెడ్యూల్‌ను ప్రకటిస్తామని, దాని ప్రకారమే ఇంటింటి సర్వే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సర్వే సత్వరమే పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతున్న తీరును ఆయా ప్రతినిధులు ఈ సందర్భంగా డీఆర్‌ఓ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి డీఆర్‌ఓ సానుకూలంగా స్పందించారు. యాప్‌లో లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై సరిగా అవగాహన చేసుకోలేని సిబ్బందికి మరోసారి శిక్షణ ఇప్పిస్తామన్నారు. నిర్దేశిత షెడ్యూల్ లేకపోవడం వల్ల బీఎల్‌వోలు, బీఎల్‌ఏల మధ్య సమన్వయం కొరవడిందని కొంతమంది రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించారు. వీలైనంత వరకూ ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య సర్వే నిర్వహించాలని కోరారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముందుగా ప్రకటించాలన్నారు. బీఎల్ ఓలకు మరే ఇతర పనుల్లేకుండా మినహాయింపు ఇస్తే సర్వే వేగంగా జరుగుతుందని సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి, ఐవీపీ రాజు, ఇమంది సుధీర్, దయానంద్, సోములుతో పాటు ఈఆర్‌వోలు సూర్యనారాయణ, పద్మలత, అప్పారావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దేవ్‌ప్రసాద్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆర్థిక కార్యాలయాల సముదాయం ప్రారంభం రేపు

- రూ.14.30 కోట్లతో మూడంతస్తుల్లో కార్యాలయ భవనాల నిర్మాణం
- ప్రారంభించనున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన

విజయనగరం అర్బన్: నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయాల సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్)ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ నెల 4న ప్రారంభించనున్నట్టు జిల్లా ఖజానా లెక్కల అధికారి ఆర్‌ఎఎస్‌కుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధ్యక్షత వహిస్తారని, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మోహనరావు పాల్గొంటారని తెలిపారు. రూ.14.30 కోట్ల వ్యయంతో మూడు అంతస్తుల్లో నిర్మించిన భవన సముదాయంలో జిల్లా ఖజానా అధికారి కార్యాలయంతోపాటు, పే అండ్ అకౌంట్స్ కార్యాలయం, ఏపీ ప్రభుత్వ బీమా కార్యాలయం, జిల్లా ఆడిట్ అధికారి (స్టేట్ ఆడిట్) కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

తోటపల్లికి వరదపోటు



తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం మరింత పెరిగింది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద బుధవారం సాయంత్రం నాటికి 105 మీటర్లకు 104.40 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిలోకి 10,670 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, అధికారులు నాలుగు గేట్లను ఎత్తివేసి 11,381 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలు కాగా, 2.106 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్టు ఏఈ కిషోర్ తెలిపారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పాత కుడి, ఎడమ కాలువలకు 290 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ఒడిశాలో కురుస్తున్న వర్షాల వల్ల నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగిందన్నారు.

విజయనగరం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌తో ప్రయోజనం
- రూ.26 కోట్లతో ఆధునికీకరణ
- బొబ్బిలి, పార్వతీపురం, చీపురుపల్లి, కొత్తవలస స్టేషన్లకు స్కీమ్‌లో చోటు



విజయనగరం రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, అదనపు హంగుల సమకూర్చాలనే లక్ష్యంతో రైల్వేశాఖ ప్రారంభించిన అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌తో విజయనగరం రైల్వేస్టేషన్‌కు మహర్దశ రానుంది. సుమారు రూ.26 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. దీర్ఘకాలిక ప్రాతిపదికన కొనసాగుతున్న స్కీమ్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్ నుంచి విజయనగరం సహా 15 రైల్వే స్టేషన్లను రైల్వే శాఖ ఎంపిక చేసింది. వాటిలో బొబ్బిలి జంక్షన్, పార్వతీపురం, చీపురుపల్లి, కొత్తవలస రైల్వేస్టేషన్లు కూడా ఉన్నాయి. ఈ స్కీమ్ ద్వారా ఒక మాస్టర్ ప్రణాళిక ప్రకారం రైల్వేస్టేషన్లలో వసతులను మెరుగుపర్చుతారు. భవనాలకు మెరుగులు దిద్దుతారు. ప్రయాణికులకు ఆధునిక వసతులను అందుబాటులోకి తీసుకొస్తారు. వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు తదితర సౌకర్యాలను మరింత మెరుగు పర్చనున్నారు. ఉచిత వైఫై, ప్రయాణికుల సమాచార వ్యవస్థలను విస్తృతం చేయనున్నారు. స్టేషన్ అవసరం, ప్రాధాన్యతను బట్టి ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, బిజినెస్ మీటింగ్ హాళ్లనూ ఏర్పాటు చేస్తారు. ల్యాండ్ స్కేపింగ్ తదితర హంగులు రానున్నాయి. మౌలిక వసతుల అభివృద్ధిపై తూర్పు కోస్తా రైల్వే విభాగం ఇప్పటికే దృష్టి సారించింది. ఇటీవలే 25కి పైగా రైల్వే స్టేషన్లను యుద్ధప్రాతిపదికను అభివృద్ధి చేయడానికి రూ.547.7 కోట్లను వెచ్చించింది.

ప్రతి రైతుకూ పశుకిసాన్ క్రెడిట్ కార్డు

- జిల్లాలోని ఆవులన్నింటికీ లంపీ స్కిన్ వ్యాధినిరోధక టీకాలు
- పశు సంవర్థకశాఖ సంయుక్త సంచాలకుడు విశ్వేశ్వరరావు



పశుటీకాల నిర్వహణపై లక్కవరపుకోట పశువైద్యాధికారిని ఆరా తీస్తున్న విశ్వేశ్వరరావు

లక్కవరపుకోట/కొత్తవలస: ప్రతీ పాడిరైతుకు పశుకిసాన్ క్రెడిట్ కార్డు అందించాలని పశుసంవర్ధక శాఖ సిబ్బందిని ఆ శాఖ సంయుక్త సంచాలకుడు ఎ.విశ్వేశ్వరరావు ఆదేశించారు. ఎల్.కోట, కొత్తవలస పశువైద్యకేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయా ఆస్పత్రుల్లోని రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. పశువులకు వ్యాధినిరోధక టీకా కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం లక్కవరపుకోటలో విలేకరులతో మాట్లాడారు. పాడిరైతులకు అందజేసే పశుకిసాన్ క్రెడిట్ కార్డుతో బ్యాంకుల్లో రాయితీపొందే అవకాశం ఉందన్నారు. అత్యవసర వేళ 1962 నంబర్‌కు రైతులు ఫోన్‌చేసి సంచార పశువైద్యశాల సేవలు పొందాలన్నారు. ఆవులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు వ్యాధినిరోధక టీకాలు ఉచితంగా వేస్తామని చెప్పారు. 4-8 నెలల్లోపుగల ఆవుదూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ విజయనగరం డివిజన్ ఉపసంచాలకులు వై.వి.రమణ, ఎ.డి.గంగాధర్, ఎల్.కోట పశువైద్యురాలు కె.గాయత్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీ బంద్



మాట్లాడుతున్న గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకుడు మండంగి లక్ష్మణరావు

పార్వతీపురంటౌన్: మణిపూర్‌లో ఆదివాసీలపై 3 నెలలుగా సాగుతున్న దాడులకు నిరసనగా గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో బంద్‌కు పిలుపునిస్తున్నట్లు గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు మండంగి లక్ష్మణరావు, కోలక అవినాష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. మణిపూర్ ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల పైశాచిక మారణహోమాన్ని ఖండిస్తున్నామన్నారు. బంద్ పిలుపుతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై భద్రతను, కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది. కార్యక్రమంలో చివరావు అప్పారావు, సీతారాం, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యాశాఖాధికారులు

మక్కువ: మండలంలోని నంద గ్రామానికి చెందిన పదవతరగతి విద్యార్థి బిడ్డిక మహేంద్ర జర్వంతో మృతిచెందడంతో, బుధవారం జిల్లా మలేరియాఅధికారి శ్యామ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటరమణలు గ్రామంలో విచారణ చేపట్టారు. మహేంద్ర కుటుంభసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆరోగ్యపరంగా ఏవిధమైన బయాందోళన చెందాల్సిన అవసరంలేదని, వైద్యసిబ్బంది వెన్నంటి ఉంటారని గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. గ్రామస్తుల వ్యాధుల బారిన పడితే ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించకుండా, ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని వైద్యసేవలు పొందాలని హితవు పలికారు. గ్రామంలో పర్యటించి ఏఎల్‌వో స్ప్రేయింగ్, ఎంసీటీ కార్యక్రమం, ఇంటింటా జ్వరాల సర్వే జరిగిందా, లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ముస్ముందు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శంబర పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎర్రసామంతవలస ఆశ్రమపాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు.

ఐడీడీఏ పీఓ సుడిగాలి పర్యటన



తోణాం పీహెచ్‌సీలో వైద్యాధికారిణితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: పట్టణం, మండలంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ మేరకు మండలంలోని తోణాంలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటరు సర్వేను పరిశీలించారు. నియమనిబంధనలకు అనుగుణంగా సర్వే చేయాలని స్పష్టం చేశారు. సమగ్ర ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం తోణాం పీహెచ్‌సీని తనిఖీ చేసి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి చికిత్సా విధానం, సదుపాయాలపై ఆరా తీశారు. ఓపీ గురించి వైద్యురాలిని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం, ఆశ్రమపాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలు, అభ్యసనాపద్ధతుల గురించి తెలుసుకున్నారు. పట్టణ సమీపంలోని నెలిపర్తి జగనన్న కాలనీని సందర్శించి సెప్టెంబరు 15 నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటరమణ, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, కమిషనర్ శంకర రావు తదితరులు ఉన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹210	₹ 220

అవినీతి పరులకు గుండెదడ..!

- జోరు పెంచిన ఏసీబీ
- టోల్ ఫ్రీ14400, యాప్‌తో సత్వర పరిష్కారం
- లైవ్ రిపోర్ట్‌తో అక్కడికక్కడే ఫిర్యాదు చేసే అవకాశం



ఏసీబీ కార్యాలయం



ప్రభుత్వ కార్యాలయాల వద్ద 14400 యాప్‌పై పోస్టర్లు అతికిస్తున్న ఏసీబీ అధికారులు

విజయనగరం క్రైమ్: అవినీతిని అంతమొందించడమే ఏసీబీ లక్ష్యం. దాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14400, యాప్‌ను రూపకల్పన చేసింది. అవినీతికి పాల్పడుతున్న వారి సమాచారాన్ని ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరూ నేరుగా యాప్‌లో తెలియజేయవచ్చు. రాష్ట్రస్థాయిలోనే ఏసీబీ ఉన్నతాధికారులకు లైవ్ రిపోర్టుతో అక్కడికక్కడే ఫిర్యాదుచేసే వెసులుబాటు ఉంది. దీంతో సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత ఏసీబీ అధికారులకు అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వీఆర్‌ఓ స్థాయి అధికారుల్లో అవినీతికి పాల్పడే వారిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుంటున్నారు. కలెక్టరేట్ అయినా, ఆర్డీఓ కార్యాలయమైనా, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, మండల కార్యాలయం, పోలీస్ స్టేషన్, వలంటీర్లు, సచివాలయం, 108, 104 సర్వీసులైనా ఎవరైనా సరే లంచం అడిగితే వెంటనే మొబైల్‌లో ఏసీబీ టోల్ ఫ్రీ 14400, యాప్‌లో బటన్ నొక్కి వీడియో కానీ, ఆడియో కానీ సంభాషణ రికార్డు చేసి పంపడమే తరువాయి డేటా నేరుగా ఏసీబీ సీఎంఓకు నివేదిస్తుంది.

ఫిర్యాదు చేసిన తక్షణమే చర్యలు

లంచం అడిగిన ప్రభుత్వ అధికారులపై ఏసీబీ నిఘా విస్తృతం చేసింది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఏసీబీ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. వారి నంబర్లను అందజేస్తున్నారు. అక్షరాస్యత ఉన్న వారంతా మొబైల్స్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లో 14400 యాప్ ద్వారా ఫిర్యాదుచేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. యాప్ ద్వారా ఎవరైనా లైవ్ స్ట్రీమింగ్, ఆడియో, వీడియో రికార్డు చేసి ఫిర్యాదు చేయవచ్చు. అవినీతికి పాల్పడుతున్న అధికారి పేరు, శాఖ వివరాలను పొందుపరిచి పంపితే, తక్షణమే అవినీతి నిరోధక శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు.

యాప్ సద్వినియోగం ఇలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో ఏసీబీ 14400 యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని నమోదుచేయడం ద్వారా వినియోగానికి సిద్ధంగా ఉంటుంది. అవినీతి వ్యవహారాలకు సంబంధించిన ఆడియో, వీడియో, ఫొటోలను నేరుగా లైవ్ రిపోర్ట్ ఫీచర్ వినియోగించుకుని అక్కడికక్కడే ఫిర్యాదుచేసే అవకాశం ఉంది.

- లాడ్జ్ కంప్లైంట్ ఫీచర్ ద్వారా తమ దగ్గరున్న డాక్యుమెంట్లు, వీడియో, ఆడియో ఫొటో ఆధారాలను ఏసీబీకి పంపించవచ్చు.
- ఫిర్యాదు రిజిస్టర్ చేయగానే మొబైల్ ఫోన్‌కు రిఫరెన్స్ నంబర్ వస్తుంది.

ప్రజల నుంచి స్పందన బాగుంది



ఏసీబీ టోల్ ఫ్రీ 14400, యాప్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. లంచం అడిగే వారిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యాప్ ద్వారా కొరడా ఝుళిపించండి. ఇప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి రసీదుపైనా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ ఉండడం ఎంతో ఉపయోగకరంగా మారింది. బాధితులు యాప్‌తో పాటు ఏసీబీ డీఎస్పీ ఫోన్ 9440446174 నంబర్‌కు ఫిర్యాదుచేయవచ్చు. లేదా నేరుగా కార్యాలయానికి వచ్చి కలవవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ప్రజలకు ఒక్క ఫోన్ కాల్‌తో సమస్య పరిష్కారమవుతుంది.

–పాత్రుని రామచంద్రరావు, ఏసీబీ డీఎస్పీ, విజయనగరం

అర్హత ఉన్న పేదలందరికీ పట్టాలు



లబ్ధిదారులకు ఇంటిస్థలం పట్టాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం పట్టాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావివలస గ్రామానికి చెందిన 14 మంది, గత్సలవలస గ్రామానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు ఇంటి స్థల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం లేని పేదలు దరఖాస్తు చేసుకుంటే అర్హతలు పరిశీలించి 90 రోజుల్లో ఇంటి స్థలం పట్టాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ఇంటి స్థలం పట్టా కావాలంటే నెలలు, సంవత్సరాలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి స్థలం పట్టా ఇవ్వాల్సిందేనన్నారు. అర్హత ఉంటే ఎవరి పైరవీలు లేకుండానే పట్టాలు మంజూరవుతాయని స్పష్టం చేశారు. అర్హత ఉండి ఇంటిస్థలం లేని పేదలు ఇంకా ఉంటే తక్షణమే తమ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పనస అప్పారావు, కొమ్ము చిరంజీవి, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

4న అప్రెంటిస్ మేళా

విజయనగరం రూరల్: హైదరాబాద్‌లోని మేధో సర్వే డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ నియామకాలకు ఈ నెల 4న మేళా నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే అప్రెంటిస్ మేళాకు వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థుల వయస్సు 25 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఎలక్ట్రీషియన్ 300, ఫిట్టర్ 300, ఎలక్ట్రానిక్ మెకానిక్ 100, వెల్డర్ 25 పోస్టులకు అప్రెంటిస్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో స్టైపెండ్ నెలకు రూ.13500, ఈఎస్ఐ, ఓటీ, యూనిఫాం, షూ ఇస్తారని చెప్పారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫారం, 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో అప్రెంటిస్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9849944654, 8985054780 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

ఏనుగుల దాడిలో పాడి ఆవు మృతి

- మరో రెండు ఆవులకు తీవ్రగాయాలు
- నాశనమవుతున్న పంటలు



పంటపొలాల్లో ఏనుగులు గుంపు



పంటపొలాల్లో ఏనుగులు గుంపు

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టిస్తోంది. వారం రోజులుగా ఎనిమిది ఏనుగుల గుంపు గ్రామంలో తిష్ఠవేసింది. బుధవారం వేకువజామున ఆవులపై దాడి చేయడంతో బొడ్రోతు రామునాయుడుకు చెందిన పాడిఆవు మృతిచెందగా, వావిలపల్లి జగన్నాథం నాయుడు, ఆలుబిల్లి ఈశ్వరరావుకు చెందిన ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. రైతుల పొలాల్లో వరి, మొక్కజొన్న, చెరకు పంటలను నాశనం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఏనుగులు పంటలకు తీవ్రనష్టం కలిగించాయని, తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ గ్రామాల సమీపంలోకి ఏనుగుల గుంపు వస్తోందని సంగాం, మగ్గూరు, ఓనెఅగ్రహారం గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ డి.ఐజాక్, ఎస్సై ఆర్.జనార్దన రావు, ఏనుగులు తిష్ఠ వేసే ప్రదేశాలను పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. అటవీశాఖ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్స్ ఎప్పటికప్పుడు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- కుమార్తె వివాహానికి డబ్బులు సమకూరలేదని మనస్తాపం



ఆత్మహత్యకు పాల్పడిన బంగారి

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామానికి చెందిన వెలుదూటి బంగారి(57) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల 24వతేదీన ఆయన కుమార్తెకు వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో వివాహానికి సంబంధించి డబ్బులు సమకూరలేదని మనస్తాపం చెంది ఇంట్లో తువ్వాలుతో ఉరేసుకున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాంబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతి

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధి వెలగాపురం గ్రామానికి చెందిన ఆరిక లలిత (25)విద్యుదాఘాతానికి గురై బుధవారం మృతిచెందింది. ఇంట్లో వేడినీరు కాచేందుకు బకెట్లో ఆమె హీటర్ పెట్టింది. నీళ్లు కాగాయా లేదో తెలుసుకునేందుకు స్విచ్ ఆఫ్ చేయకుండా బకెట్‌లో చేయి పెట్టడంతో ప్రమాదం సంభవించింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త రాజేంద్రప్రసాద్, రెండున్నరేళ్ల కుమారుడు ప్రేమసాగర్ ఉన్నారు. ఫిర్యాదు మేరకు దోనుబాయి స్టేషన్ ఏఎస్సై త్రినాథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన లలిత

వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ లైఫ్ టైం అవార్డు–2023, వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభా పాటవాలు చూపిన వ్యక్తులు దరఖాస్తుకు అర్హులని వివరించారు. ఉత్తమ సేవలు అందిస్తున్నప్పటికీ ప్రజా జీవనంలో కనిపించక అజ్ఞాత వ్యక్తుల్లా గ్రామాలు ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు కూడా అర్హులని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంస్థలు, సొసైటీలు కూడా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వ్యక్తులు, సంస్థలు చేసిన పనిని ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఫోన్ నంబరు, ఈమెయిల్‌తో సహా పూర్తి వివరాలను సమర్పించాలని సూచించారు. క్రీడా రంగంలో గల ఆసక్తి, అర్హత గల వ్యక్తులు, సంస్థలు దరఖాస్తులను ఆగస్టు 20వ తేదీ లోగా సమర్పించాలని కోరారు.

108 జిల్లా మేనేజర్ బాధ్యతల స్వీకరణ



నజీర్ హుస్సేన్‌కు అభినందనలు తెలియజేస్తున్న 108, 104 సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ 108 విజయనగరం జిల్లా మేనేజర్‌గా నజీర్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 108, 104 సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేసిన ఎస్.మన్మథనాయుడికి పార్వతీపురం మన్యం జిల్లా మేనేజర్‌గా బదిలీ అయింది. ఈ సందర్భంగా నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ 108 అంబులెన్సుల ద్వారా మరింత మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని, ప్రభుత్వం ఏ లక్ష్యంతో అయితే అంబులెన్సులను ప్రవేశపెట్టిందో ఆ లక్ష్యాన్ని శతశాతం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వానికి మంచి గుర్తింపు తీసుకురావడానికి పాటు పడతానన్నారు. ఆయనకు అభినందనలు తెలిపిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా 108 మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, విజయనగరం జిల్లా 104 మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్, 108 ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముఖ, రవికుమార్ ఉన్నారు.

బంగారు తల్లి పల్లవి

- వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ కైవసం



పల్లవిని అభినందిస్తున్న సత్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జూలై 28 నుంచి జరుగుతున్న ఏషియన్ యూత్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో సత్య కళాశాల విద్యార్థిని ఎస్. పల్లవి 64 కేజీల జూనియర్ విభాగంలో ఒక బంగారు పతకం, రెండు రజత పతకాలు సాధించింది. ఈ పోటీలో పల్లవి స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్-జర్క్‌లో 109 కేజీలు, మొత్తం 196 కేజీలు ఎత్తి పతకాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎం శశిభూషణరావు, విద్యార్థినిని అభినందిస్తూ ధీర, సత్య విద్యాసంస్థల తరఫున పల్లవికి పౌష్టికాహారం నిమిత్తం గత ఆరు నెలలుగా నెలకు రూ.30వేల నగదు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల కూడా రూ.30 వేల నగదును పల్లవి బ్యాంక్ అకౌంట్‌కు జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ పల్లవికి మంచి భవిష్యత్తు ఉందని, ఈ విధంగా భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ స్థాయిలో బాగా రాణించి ఎన్నో బంగారు పతకాలను సాధించి దేశానికి రాష్ట్రానికి అలాగే విజయనగరం జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. కోచ్ చల్లా రాము మాట్లాడుతూ పల్లవి అంతర్జాతీయంగా పతకాలు సాధించడంలో సత్య విద్యాసంస్థల ఆర్థిక సహాయం ఎంతగానో తోడ్పడిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణి, వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ సత్యవేణి అధ్యాపక, అధ్యాపకేతర బృందం పల్లవిని అభినందించారు.

కేజీబీవీల్లో టీచర్లను కొనసాగించాలి

- ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: కేజీబీవీల్లో గెస్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయలను కొనసాగిస్తూ తరువాత ఖాళీలను మాత్రమే కొత్తవారికి ఇవ్వాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ పేర్కొంది. కేజీబీల ప్రారంభం నుంచి పనిచేస్తున్న గెస్ట్ పీజీటీలకు, బోధనేతర సిబ్బందికి కనీస గౌరవేతనంతో పనిచేస్తూ..10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించిన అనుభవం ఉందన్నారు. నాలుగేళ్ల నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ తరగతులకు బోధిస్తున్న పలువురు పీజీటీలను తిరిగి విధుల్లోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పలు పీజీటీ పోస్టులను వారితోనే భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, కార్యదర్శి కె.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

విద్యుత్ అనధికార కనెక్షన్‌తోనే ప్రమాదం

బాడంగి: మండలంలోని పూడివలసలో మంగళవారం జరిగిన వేతనదారుల మృతికి గ్రామానికి చెందిన రైతు సత్యం వ్యవసాయబావి మోటార్‌కు దొంగతనంగా వాడిన విద్యుత్‌కనెక్షన్ కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ రైతు కొన్నేళ్లుగా విద్యుత్ అక్రమ కనెక్షన్ కలిగి ఉన్నప్పటికీ ఆ శాఖ సిబ్బంది పట్టించుకోక పోవడం కూడా ఇందుకు మరోకారణంగా భావించి రైతు సత్యం తో పాటు సంబంధిత గ్రామ లైన్‌మన్ ఏసుపై కేసు నమోదుచేశారు. ఏడాదికాలంగా ఆ సర్వీస్ వైరును రైతు వాడకపోవడంతో జీవ వైరు తెగిపోయి విద్యుత్‌వైర్లపై నుంచి నేలకు వేలాడడంతో ప్రమాదం జరిగినట్లు మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్.జయంతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పలనాయుడు, రామమూర్తిల మృతదేహాలకు సీహెచ్‌సీ వైద్యులు బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చెరువులో చేపలు మృతి



చెరువులో తేలిన చేపలను చూపిస్తున్న సహకార సంఘం సభ్యుడు కొమ్ము వెంకటరమణ

కొమరాడ: మండలంలోని మాదలింగి గ్రామంలో గల ఊర చెరువులో విషపదార్థాలు కలవడం వల్ల చేపలు మృతి చెందినట్లు గ్రామ సర్పంచ్ తుమరాడ కళావతి, శ్రీ రాజీవ్ గిరిజన మత్స్య పారిశ్రామిక సహాయక సహకార సంఘం సభ్యుడు కొమ్ము వెంకటరమణ బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లవారు జామున చెరువు వద్దకు వెళ్లే చూసేసరికి వేలాది రూపాయల విలువ చేసిన చేపలు మృతి చెంది నీటిపై తేలి ఉన్నాయన్నారు. 2006లో గిరిజనులంతా కలిసి ఒక సహకార సంఘంగా ఏర్పడి చెరువును గ్రామ పంచాయతీ నుంచి లీజుకు తీసుకుని చెరువులో చేపలు విడిచిపెట్టి వాటిపై వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు చేపలు చనిపోవడంతో జీవనాధారం కోల్పోయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువులో చేపలకు విషపదార్థాలు విడిచిపెట్టిన వారిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శ్రీ రాజీవ్ గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అప్పన్న దొర మాట్లాడుతూ చెరువుపైన ఉన్న పొలాల రైతులు పురుగు, కలుపు మందులు చల్లడం వల్ల చేపలు మృతి చెందాయన్నారు.

ఆటోను పాల వ్యాన్ ఢీకొని ఐదుగురికి గాయాలు

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి, ఎస్ సీతారంపురం జంక్షన్ వద్ద బుధవారం ఆటోను పాల వ్యాన్ ఢీ కొట్టడంతో ఐదుగురు వ్యక్తులు స్వల్ప గాయాలపాలయ్యారు. రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న అదే మార్గంలో పాల వ్యాన్ ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అప్పలరాజు గ్రామానికి చెందిన అల్లాడ యల్లమ్మ, వేరే గ్రామాలకు చెందిన ఉషారాణి, సన్యాసమ్మ, చిన్నమ్మ, వెంకటరమణలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితులను ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదుమేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.